సాక్షి అనంతపురం

మంగళవారం । 23 । జూలై । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.47

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.47 పలికింది

గరిష్ఠం/కనిష్ఠం
32.6°/ 23.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా రమేష్ బాబు



రమేష్‌బాబుకు నియామక పత్రం అందజేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా డాక్టర్ ఈ. రమేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రమేష్ బాబును అభినందించారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎంకాం చదివిన రమేష్ బాబు ఎస్కేయూలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. కర్ణాటక రాష్ట్రం పావగడలోని డిగ్రీ కళాశాలలో, గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. 2000 సంవత్సరంలో ఎస్కేయూలో రీసెర్చ్ కమ్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి లీగల్ సెల్, పెన్షన్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు రిజిస్ట్రార్ పదవి వరించింది.

11 ఏళ్ల తర్వాత బోధనేతర ఉద్యోగికి..

ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా చాలావరకూ ప్రొఫెసర్లనే నియమించేవారు. అయితే, 11 సంవత్సరాల క్రితం బోధనేతర ఉద్యోగి అయిన రవీంద్ర రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత రిజిస్ట్రార్లుగా ప్రొఫెసర్లే కొనసాగారు. తాజాగా రమేష్‌బాబు నియామకంతో మళ్లీ ఓ బోధనేతర ఉద్యోగికి ఆ పోస్టును కట్టబెట్టినట్లయింది.

సామాజిక న్యాయానికి పాతర..

కొత్త ప్రభుత్వం సామాజిక న్యాయానికి పాతరేస్తోంది. కీలక పదవుల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎస్కేయూ రెక్టార్‌గా కొనసాగుతున్న వ్యక్తి, తాజాగా రిజిస్ట్రార్‌గా నియమితులైన వ్యక్తి ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడమే దీనికి నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రార్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి కట్టబెట్టారు. మిగిలిన కీలక పోస్టుల్లో వివిధ వర్గాలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ, నేడు ఆ సంప్రదాయాన్ని పక్కన పెట్టడం సర్వత్రా విస్మయానికి గురి చేస్తోంది.

జెడ్పీ చైర్‌పర్సన్ గన్‌మెన్ల తొలగింపు

అనంతపురం సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు గన్‌మెన్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. జెడ్పీ చైర్‌పర్సన్లకు 1+ 1 గన్‌మెన్లను గత ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఇంత వరకు గన్‌మెన్లుగా వ్యవహరించిన పోలీసులు తమ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. కేబినెట్ హోదా కలిగిన జెడ్పీ చైర్‌పర్సన్‌కు గన్‌మెన్లను తొలగించడం చర్చనీయాంశమవుతోంది.

ఇన్‌చార్జ్ జేసీగా రామకృష్ణారెడ్డి



అనంతపురం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి జి.రామకృష్ణారెడ్డికి ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జేసీ కేతన్ గార్గ్‌ని ప్రభుత్వం బదిలీ చేసింది.రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. కొత్తగా ఎవరినీ జాయింట్ కలెక్టర్‌గా నియమించలేదు. దీంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను డీఆర్‌ఓకి కలెక్టర్ అప్పగించారు.

గుత్తి ఆర్టీసీ డిపోలో చేతివాటంపై దర్యాప్తు

అనంతపురం క్రైం: ఆర్టీసీ అధికారుల అండదండలతో రూ.లక్షలను కాంట్రాక్టర్లు దోచుకుతిన్న వైనంపై లోతైన విచారణ మొదలైంది. గుత్తి ఆర్టీసీ డిపో పరిధిలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులు దోచుకున్న వైనంపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు వెలువడ్డాయి. దీనిపై ఆర్టీసీ విజిలెన్స్, ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు స్పందించారు. అనంతపురం ఆర్టీసీ డిపో అసిస్టెంటు మేనేజరు వి.చంద్రశేఖరరెడ్డిని విచారణాధికారిగా నియమించారు. జరిగిన అక్రమాలపై నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో లేబర్ కాంట్రాక్టర్‌తో కలసి లక్షల రూపాయలు పంచుకుతిన్న ఆరుగురు అధికారులను అనంతపురం డిపోలో సోమవారం చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాంట్రాక్టరుతో పాటు ఆర్టీసీ గుత్తి డిపోలోని సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హోదా ఉన్న ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు నిర్ధారించారు. ఇప్పటికే ప్రాథమిక విచారణలో నిగ్గు తేలిన వాస్తవాల ఆధారంగా సంస్థను మోసం చేసి స్వాహా చేసిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ కాంట్రాక్టర్‌కు ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారులు నోటీసులు సైతం జారీ చేశారు. ఇందుకు గడువును విధించారు.

గళమెత్తాలి.. దశ మార్చాలి

- అసెంబ్లీ సమావేశాలపై 'అనంత' ఆశలు
- 'కూటమి' మేనిఫెస్టోపై స్పష్టతకు డిమాండ్
- 'భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ' ప్రకటించాలని రైతన్నల ఆకాంక్ష
- 'ఫీజు రీయింబర్స్‌మెంట్'కు విద్యార్థుల వేడుకోలు
- జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని మేధావుల సూచన
- వాణి బలంగా వినిపించాలని శాసనసభ్యులకు అన్ని వర్గాల విజ్ఞప్తి



అనంతపురం : దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో అనంతపురం జిల్లా ఒకటి. రాజస్తాన్‌లోని జైసల్మీర్ తరువాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యేది ఇక్కడే. జిల్లాను దశాబ్దాలుగా కరువు వెంటాడుతోంది. తాగు, సాగునీటికి తిప్పలు తప్పడం లేదు. భూగర్భ జలాల కోసం అన్వేషిస్తున్న రైతన్న అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నాడు. లక్షలాది మంది వ్యవసాయ కూలీలు పొట్టచేత పట్టుకుని ఉపాధిని వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. చదువుకున్న యువత నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నికల ముందు అన్ని వర్గాలకూ హామీలిచ్చి ఆశలు రేపిన 'కూటమి' అధికారంలోకి వచ్చింది. సోమవారం అమరావతిలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో జిల్లా ప్రజలు సమావేశాలను ఆసక్తిగా గమనిస్తున్నారు. హామీలపై స్పష్టతనివ్వాలని అన్ని వర్గాల వారు కోరుతున్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై శాసనసభ్యులు గళమెత్తాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య తీర్చాలి



జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కలుషిత నీటిని తాగుతూ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,985 గ్రామాలకే సత్యసాయి, ఆర్‌డబ్ల్యూఎస్, బహుళ రక్షిత నీటి పథకాల ద్వారా నీటిని అందిస్తున్నారు. మిగిలిన గ్రామాలకు రక్షిత నీరు అందడం లేదు. సుమారు 800 గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి ఏటా కనీసం 250 గ్రామాలకు పైగా తాగునీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించి తాగు నీటి సమస్యలు తీర్చాలి. ఈ విషయాలను అసెంబ్లీలో లేవనెత్తాలి.

– ఎస్. నాగేంద్ర కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అరాచకాలకు స్వస్తి పలకాలి



ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. చంద్రబాబు రాష్ట్ర సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో విచ్చలవిడిగా హత్యలు, అల్లర్లు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా?లేదా అన్న భయాందోళనలో ప్రజలు జీవిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడులు నేటికీ ఆగడం లేదు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజం. ఎవరు గెలిచినా ప్రజలకు మేలు చేయాల్సిన బాధ్యత మర్చిపోకూడదు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై అసెంబ్లీలో చర్చించాలి.

– జైపాల్ రెడ్డి, దాసంపల్లి, కళ్యాణదుర్గం మండలం

లక్ష ఎకరాలకు సాగు నీరందాలి



జిల్లా విడిపోయిన తరువాత నికరంగా 14.85 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. ఆయకట్టు 45,224 ఎకరాలుగా ఉంది. జిల్లాలో కేవలం 3.04 శాతం భూమికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం ఉండడం విచారకరం. కనీసం ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలి. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకీకరణ పనులు చేపట్టాలి. పెన్నోహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ విస్తరణకు భూ సేకరణ చేయకపోవడంతో 4, 5 టీఎంసీలకు మించి నిల్వ చేసే పరిస్థితి లేదు. దీనిపైనా దృష్టి సారించాలి. ఉంతకల్లు జలాశయంతో పాటు హంద్రీనీవా పంట కాలువ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి.

– జి. రాజారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



జిల్లా పునర్వ్యవస్థీకరణతో శ్రీ సత్యసాయి జిల్లాకు సింహభాగం పరిశ్రమలు వెళ్లిపోయాయి. ఈ నేపథ్యంలో మన జిల్లాలోనూ భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు స్థాపించడాన్ని ప్రాధాన్యతాంశంగా తీసుకోవాలి. జిల్లాలో విస్తారమైన భూమి, విలువైన ఖనిజ వనరులు, గణనీయంగా సోలార్, విండ్ ద్వారా విద్యుదుత్పత్తి, కర్ణాటక–తెలంగాణ రాష్ట్రాల రాజధానులతో అనుసంధానించిన పొడవైన జాతీయ రహదారి ఉన్నాయి. 64 రకాల ఖనిజాలు లభ్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎమ్మెల్యేలు ఈ విషయాలు ప్రస్తావించాలి.

–ఎస్. జయపాల్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యువజన సంఘం

బకాయిలు విడుదల చేయాలి



గత ప్రభుత్వంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆసరాగా నిలిచాయి. కొత్త ప్రభుత్వంలో ఆ పథకాలు కొనసాగించి నిరుపేద విద్యార్థుల కోసం సకాలంలో నిధులు విడుదల చేయాలి. ఫీజుల చెల్లింపు విషయంలో కళాశాలల నుంచి విద్యార్థులకు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా చూడాలి. ప్రస్తుతం ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా తక్షణమే ప్రభుత్వం దృష్టి సారించాలి. కోర్సు పూర్తయిన వారు ఉన్నత చదువులకు వెళ్లేందుకు సర్టిఫికెట్లు జారీ చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలి.

– జీవీ లింగా రెడ్డి, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మరింత అభివృద్ధి చేయాలి



అనంతపురం నగరంలో గత ప్రభుత్వ హయాంలో సమగ్రాభివృద్ధి జరిగింది. బళ్లారి బైపాస్ రోడ్డు నుంచి పంగల్ రోడ్డు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం జరిగింది. ఇంత అభివృద్ధి గతంలో ఎన్నడూ చూడలేదు. కొత్త ప్రభుత్వం మరింత అభివృద్ధిపై దృష్టి సారించాలి. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే నగరం రూపురేఖలు మారిపోతాయి. పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి సారించాలి. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– హేమంత్‌కుమార్, అనంతపురం

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



డీ హీరేహాళ్ మండలంలో ఖుద్రేముఖ్ ఉక్కు ప్రభుత్వ పరిశ్రమను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి. జూనియర్ న్యాయవాదులకు 10 సంవత్సరాల పాటు నెలకు రూ.5 వేలు పారితోషికం ఇవ్వాలి. సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించడంతో పాటు శాశ్వత భవనాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. వర్సిటీల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలి. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి జిల్లాను కరువు నుంచి కాపాడాలి. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు అందజేయాలి.

– సూర్యచంద్ర యాదవ్, న్యాయవాది

జాకీని తీసుకురావాలి



జాకీ పరిశ్రమను మళ్లీ రాప్తాడుకు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి. ఇటీవల ఎన్నికల ప్రచారంలో జాకీ పరిశ్రమను తెస్తామని ప్రజలకు పరిటాల సునీత హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ఆమె ప్రస్తావించాలి. గత టీడీపీ ప్రభుత్వంలో పరిశ్రమ నిర్మాణం కోసం రైతుల పొలాలను బలవంతంగా లాక్కున్నారు. 2018లో పరిటాల సునీత, లోకేశ్, పరిటాల శ్రీరామ్, మురళి రూ.30 కోట్లు కప్పం కట్టాలని ఫ్యాక్టరీ నిర్వాహకులను డిమాండ్ చేయడంతో అంత డబ్బు చెల్లించలేక హైదరాబాద్‌కు తరలివెళ్లిపోయారు.

– బోయ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ, రాప్తాడు

అర్జీదారులతో మాట్లాడండి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'అర్జీదారులతో నేరుగా మాట్లాడాలి. సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శిరీష, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వరరావు, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, జ్యోతిబాపూలే గురుకుల కన్వీనర్ సంగీత కుమారి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 534 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలోని అర్జీల పరిష్కారంపై సిబ్బందితో రోజూ సమీక్షించాలన్నారు. గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

పొలాలకు వెళ్లే దారిని బంద్ చేయడంతో ఇబ్బంది పడుతున్నామని నార్పల మండలం సొదనపల్లికి చెందిన లోకనాథ్‌రెడ్డి, నాగభూషణ, నాగప్ప, ఆది నారాయణరెడ్డి, లక్ష్మినారాయణ విన్నవించారు. 40 మంది రైతులకు సర్వే నంబరు 82లో 150 ఎకరాల భూమి ఉందన్నారు. పొలాలకు వెళ్లేందుకు రస్తా ఉందన్నారు. అయితే ఒక రైతు అడ్డగిస్తుండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, సర్వే చేయించి దారి చూపించాలని కోరారు.

- విద్యుదాఘాతంతో తన భర్త మరణించడంతో జీవనం దుర్భరంగా మారిందని, సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించాలని నార్పల మండలం నడిమిపల్లికి చెందిన ఉమాదేవి విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో తన భర్తతో పాటు ఒక గేదె కూడా చనిపోయిందన్నారు. తనకు ఇద్దరు కుమారులని, భర్త చనిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.
- న్యాయమైన పరిహారం అందించాలని పుట్లూరు మండలం శనగలగూడూరుకు చెందిన రైతులు రంగనాయకులు, రమేష్, నాగేశ్వరి, నారాయణ స్వామి, వెంకటేశ్వరమ్మ, లక్ష్మిఉమాదేవి విన్నవించారు. తమ పొలాల్లోంచి కేవీ40 విద్యుత్ లైన్ వెళుతోందన్నారు. ఒక్కో స్తంభానికి రూ.4 లక్షలు పరిహారం మంజూరు చేయించాలని కోరారు. వైఎస్సార్ జిల్లాలో స్తంభానికి రూ.3.15 లక్షలు ఇచ్చారని, అదే తరహాలో పరిహారం ఇప్పించి న్యాయం చేయాలన్నారు.

భూ సేకరణపై దృష్టి సారించండి

జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారులు, ఏపీఐఐసీ, సోలార్, పవర్‌గ్రిడ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి పనుల్లో ప్రతి వారం పురోగతి చూపించాలని ఆదేశించారు. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని చెప్పారు. సమావేశంలో ఆర్‌డీఓలు జి.వెంకటేష్, రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ టౌన్ బ్యాంకు లైసెన్సు రద్దు

- తాజాగా రిజర్వ్ బ్యాంక్ ఉత్తర్వులు
- స్వయానా ఆర్థిక శాఖ మంత్రి కేశవ్ నియోజకవర్గం కావడంతో చర్చనీయాంశం



ఉరవకొండ సహకార టౌన్ బ్యాంకు స్థాపించింది	1934
బ్యాంకు పరిధిలో ఖాతాదారులు	4,700
డిపాజిటర్లకు చెల్లించాల్సిన బకాయిలు	రూ.4.7 కోట్లు
బ్యాంకుకు రావాల్సిన బకాయిలు	రూ.1.70 కోట్లు
ఆర్‌బీఐ వద్ద ఉన్న సెక్యూరిటీ డిపాజిట్లు	రూ.2.94 కోట్లు
వివిధ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న మొత్తం	రూ.1 కోటి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తొంభై ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఉరవకొండ సహకార టౌన్ బ్యాంకు శకం ముగిసింది. వేలాది మంది ఖాతాదారులకు సేవలందించిన ఈ బ్యాంకు ఇక నడవడం కష్టమే అంటున్నారు. 1934లో ఏర్పాటైన ఈ బ్యాంకు సరిగ్గా తొంభై సంవత్సరాలు సేవలందించింది. ప్రస్తుతం బ్యాంకు లావాదేవీలు, నిర్వహణ సరిగా లేని కారణంగా లైసెన్సు రద్దు చేస్తూ ఈ నెల 20న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఉత్తర్వులు జారీచేసింది. దీంతో బ్యాంకు లావాదేవీలు పూర్తిగా స్తంభించనున్నాయి. స్వయాన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న బ్యాంకు లైసెన్సు రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆర్‌బీఐ ఉత్తర్వులతో బ్యాంకు ఆర్థిక లావాదేవీలన్నీ స్తంభించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

నిబంధనలు అనుసరించకపోవడంతోనే..

ఏ బ్యాంకులైనా ఆర్‌బీఐ నిబంధనలు పాటించకపోతే వాటిని బ్లాక్‌లిస్టులో పెట్టడం లేదా లైసెన్సు రద్దు చేసే అధికారం ఆర్‌బీఐకి ఉంటుంది. ఉరవకొండ టౌన్‌బ్యాంకులో కొంత కాలంగా లావాదేవీల నిర్వహణ సరిగా లేకపోవడం, తగినంత క్యాపిటల్ లేకపోవడం, బ్యాంకు పరిధిలో పరిపాలనలో అవినీతి అక్రమాలు వెరసి ఈ బ్యాంకు లైసెన్సు రద్దుకు దారితీశాయి. 1949 బ్యాంకింగ్ నియంత్రణ చట్టాన్ని అనుసరించి ఈ బ్యాంకు నిర్వహణ సరిగా లేదని నిర్ధారించుకున్న తర్వాత లైసెన్సు రద్దు చేసినట్టు ఆర్‌బీఐ ఉత్తర్వుల్లో పేర్కొంది. బ్యాంకు నిర్వహణ సరిగా లేని కారణంగా గత కొన్ని నెలలుగా డిపాజిటర్లు తమ సొమ్ము చెల్లించాలని తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. కానీ సకాలంలో చెల్లింపులు చేయలేదు. త్వరలోనే ఇందుకోసం లిక్విడేటర్‌ను నియమించి పరిష్కార మార్గాలు సూచిస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. డిపాజిటర్లు భయపడాల్సిన పనిలేదని, ఆర్‌బీఐ సూచనల మేరకు అందరికీ సొమ్ము చెల్లిస్తామని జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ఆఫీసర్ అనురాధ తెలిపారు.

ఆశల పరవళ్లు

- హెచ్చెల్సీకి నీరు విడుదల
- సంప్రదాయబద్ధంగా పూజలు చేసి శ్రీకారం చుట్టిన అధికారులు

అనంతపురం సెంట్రల్/బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేశారు. సోమవారం టీబీ బోర్డు అధికారులు డ్యాం వద్ద సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్చెల్సీ ఈఈ రవిచంద్రతో కలిసి తుంగభద్ర బోర్డు సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి స్విచ్ ఆన్ చేసి 500 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ సందర్భంగా హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ మాట్లాడుతూ 23వ తేదీ సాయంత్రం 6 గంటలకల్లా ఆంధ్రా సరిహద్దులోని 105 కిలోమీటర్‌కు తుంగభద్ర జలాలు చేరుతాయన్నారు. వాటా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీల నీరు విడుదలవుతాయన్నారు. తుంగభద్ర జలాశయానికి ఈ ఏడాది ముందుగానే నీరు చేరాయన్నారు. డ్యాం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో ఇంకా గణనీయంగా సాగుతోందన్నారు. రైతులు సాగు నీరు వృథా చేయకుండా వాడుకోవాలని చెప్పారు. 26వ తేదీ తర్వాత 750 క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచుతారన్నారు. ఆగస్టు నుంచి క్రమంగా పెంచుకుంటూ పోతారన్నారు. పీఏబీఆర్‌లో తాగునీటి నిల్వ అనంతరం పంటలకు నీటిని విడుదల చేస్తామన్నారు. ఆగస్టు రెండవ వారంలో జరిగే సాగునీటి సలహామండలి (ఐఏబీ) సమావేశంలో ఏయే కాలువలకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేయాలన్నది కలెక్టర్, ప్రజాప్రతినిధులు నిర్ణయిస్తారని వెల్లడించారు.



డ్యాం వద్ద స్విచ్ బోర్డుకు పూజలు నిర్వహిస్తున్న అధికారులు



తుంగభద్ర ఎగువ కాలువలో పారుతున్న జలాలు

1,13,402 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

టీబీ డ్యాంకు వరద ఆగడం లేదు. సోమవారం ఉదయం 1,13,402 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 95.359 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,628.09 అడుగులకు నీరు చేరింది. ఈ క్రమంలో 3 క్రస్ట్ గేట్ల ద్వారా 3,987 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ సీఈఓగా ప్రభాకర్‌రావు



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసి, జెడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావుకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. ఇప్పటి వరకూ సీఈఓగా పని చేసిన వైఖోమ్ నిదియాదేవిని అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. ఆమె ఆదివారం రాత్రే రిలీవ్ అయ్యారు. పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా డీపీఓ ప్రభాకర్‌రావుకు ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి, చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు.

24న ఉద్యోగ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎ.కళ్యాణి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 40 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 23 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు. ఆసక్తి ఉన్న యువతీయువకులు బయోడేటా ఫారం, విద్యార్హతల జిరాక్స్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఏదైనా ఐడీ ప్రూఫ్‌తో 24న ఉదయం 10.30 గంటలకు కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. పూర్తి సమాచారానికి 08554-245547లో సంప్రదించవచ్చు.

నక్కలపల్లిలో పోటాపోటీగా రాష్ట్రస్థాయి భజన పోటీలు

బెళుగుప్ప: గురుపౌర్ణమి సందర్భంగా బెళుగుప్ప మండలం నక్కలపల్లిలోని శిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీలు పోటాపోటీగా సాగాయి. మొత్తం 16 భజన బృందాలు పాల్గొనగా... శంకరాపురం భజన బృందం మొదటి స్థానం దక్కించుకుంది. రెండో స్థానంలో గుర్రబ్బాడు భజన బృందం, మూడో స్థానంలో వెంకటాంపల్లి బృందం నిలిచాయి. విజేతలకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి బృందానికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉత్తమ హార్మోనిస్టుగా భార్గవాచారి, ఉత్తమ గాయకుడిగా ఈశ్వరయ్య, ఉత్తమ తబలిస్టుగా గురువర్ధన్ బహుమతులు అందుకున్నారు.

'పోలీసు స్పందన'కు 109 వినతులు



సమస్య వింటున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 109 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మురళీకృష్ణ స్వయంగా అర్జీలు స్వీకరించారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కాగా, రోడ్డు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్న అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీకి చెందిన ఓబులేసు తన సమస్యను ఎస్పీతో మొరబెట్టుకునేందుకు ఆటోలో డీపీఓకు చేరుకున్నాడు. ఇది గమనించిన ఎస్పీ కాన్ఫరెన్స్ హాలు బయట ఆటోలో ఉన్న బాధితుడి వద్దకే పలకరించి ఫిర్యాదు స్వీకరించారు. అక్కడిక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, అనంతపురం డీఎస్పీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అనంత మమతా నిలయం

- ప్రారంభించిన కలెక్టర్ వినోద్‌కుమార్
- కలెక్టరేట్‌కు వచ్చే గర్భిణులు, బాలింతలు, చంటిబిడ్డలకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు
- మహిళా ఉద్యోగులు సేదదీరేలా ప్రత్యేక వసతులు



అనంత మమతా నిలయం ప్రారంభించిన అనంతరం ఐసీడీఎస్ అధికారులతో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే బాలింతలు, చంటి బిడ్డల తల్లులు, గర్భిణుల సౌకర్యార్థం, మహిళ ఉద్యోగులు విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేకంగా 'అనంత మమతా నిలయం' ఏర్పాటు చేశారు. ఈ నిలయాన్ని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం పారంభించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. నిలయంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, గోడల మీద సుందరంగా చిత్రీకరించిన చిత్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... కలెక్టరేట్‌కు వివిధ పనులపై వచ్చే గర్భిణులు, బాలింతలు, చంటిబిడ్డల తల్లులు తమ కనీస అవసరాలు తీర్చుకునేందుకు, సేదదీరేందుకు, పిల్లలకు పాలు పట్టేందుకు అనుకూలంగా ఉండడంతో పాటు, మహిళ ఉద్యోగులు సేదదీరేందుకు ప్రత్యేకంగా మమతా నిలయం ఏర్పాటు చేశామన్నారు. నిలయం ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎస్‌డబ్ల్యూఐడీసీ డీఈఈ రమణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, శిశుగృహ మేనేజర్ దీప్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దత్తత- అప్యాయత పోస్టర్లతో పాటు నగర పాలక సంస్థకు సంబంధించి సిటీ డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ ప్లాన్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, మునిసిపల్ ఆర్‌డీ పీవీఎస్ఎన్ మూర్తి, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.ఎస్.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, శిశుగృహ మేనేజర్ దీప్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకే గర్వకారణం

జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన మీరందరూ జిల్లాకే గర్వకారణం అంటూ జిల్లా పారా క్రీడాకారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. కర్ణాటక రాజధాని బెంగుళూరు వేదికగా ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ జరిగిన జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన వారిని కలెక్టర్ ఘనంగా సన్మానించారు. 10 మంది పారా క్రీడాకారులు పాల్గొని ఒక బంగారు, ఒక వెండి, రెండు కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. మరిన్ని విజయాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ రసూల్, డీఎస్‌డీఓ షఫీ, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి శ్రీనివాసులు, శాప్ అథ్లెటిక్స్ కోచ్ మంజుల, క్రీడాకారులు అవిలికొండ నరేష్, మల్లెల సుదర్శన్, అవలపాడు భార్గవ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారి అనుమానాస్పద మృతి



మృతి చెందిన రూవి

అనంతపురం: నగరంలోని నాయక్ నగర్‌లో నివాసం ఉంటున్న ఎం.రవి, రీషా దంపతుల కుమార్తె రూవి (రెండున్నర నెలలు) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాలు తాగుతున్న సమయంలో దగ్గు రావడంతో ఊపిరి అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో హుటాహుటినా ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, చిన్నారి మృతిపై తండ్రి అనుమానాలు వ్యక్తం చేస్తూ అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నివేదిక అందని తర్వాత వాస్తవాలు నిర్ధారణ అవుతాయని కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం సిటీ: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) మృతిచెందాడు. ఆదివారం రాత్రి అనంతపురంలోని రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో శరీరం పూర్తిగా ఛిద్రమైపోయింది. జీఆర్‌పీ ఎస్ఐ విజయకుమార్ పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నీలం రంగు టీ షర్ట్, తెల్లరంగు లుంగీ ధరించాడు. మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని అనంతపురం రైల్వే పోలీసులు కోరారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



మృతుడు నారాయణస్వామి

గుత్తి రూరల్: మండలంలోని ఊబిచెర్ల గ్రామానికి చెందిన కౌలురైతు కాయల నారాయణ స్వామి(48) ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వెంకటలక్ష్మి, కుమారుడు తెలిపిన మేరకు... కాయల నారాయణస్వామి గ్రామంలోని ఇద్దరు రైతుల వద్ద తొమ్మిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.8 లక్షల అప్పు చేసి పంట సాగు చేపట్టాడు. ఈ క్రమంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు పండక అప్పులకు వడ్డీ భారం పెరిగింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడేవాడు. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకూ పదునైన వర్షం కురవకపోవడంతో ఇక అప్పులు తీర్చడం తన వల్ల కాదని మనస్తాపానికి గురైన ఆయన ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచిన భార్య.. ఉరికి విగత జీవిగా వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేస్తూ అప్రమత్తం చేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని నారాయణస్వామిని కిందకు దించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకున్న స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమజంటపై రైల్వే కో-పైలెట్ దౌర్జన్యం

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం ఓ ప్రేమజంటపై కో-పైలెట్ రంగయ్య అసభపదజాలంతో విరుచుకుపడ్డాడు. వివరాలు... వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన యువతి తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో కొంత కాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. దీంతో సోమవారం యువతిని చూసేందుకు ఆ యువకుడు తాడిపత్రికి వచ్చాడు. అప్పటికే రైల్వేస్టేషన్‌కు చేరుకున్న యువతితో కలసి వెయిటింగ్ హాల్‌కు చేరుకుని మాట్లాడుతూ కూర్చొన్నాడు. అదే సమయంలో గుంతకల్లుకు వెళ్లేందుకు సూపర్‌ఫాస్ట్ రైలు కోసం ఎదురు చూస్తున్న కో-పైలెట్ రంగయ్య వీరిద్దరినీ గమనించి వెయిటింగ్ హాల్‌లోకి వెళ్లాడు. అక్కడ ఉన్న వారితో అసభ్యకరంగా మాట్లాడడంతో ప్రేమికులు భయపడి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయినా రంగయ్య వారిని వదలకుండా వెంటాడుతూ వాహనాల పార్కింగ్ వద్ద యువతి జబ్బ పట్టుకుని రైల్వేస్టేషన్‌లోని ఈడ్చుకుని వెళ్లాడు. యువతి కాళ్లవేళ్లా పడి బతిమలాడుతున్నా విడకుండా ఆ ఉదంతాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ రైల్వే ఔట్‌పోస్టులోని పోలీసుల వద్దకు లాక్కెళ్లాడు. ఎందుకు వారిని తీసుకొచ్చావని పోలీసులు అడుగుతున్నా వినకుండా ప్రేమికులపై అసభ్య పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీనిపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చీవాట్లు పెట్టడంతో రంగయ్య అక్కడి నుంచి వైదొలిగాడు. అనంతరం ప్రేమ జంటను విచారించిన పోలీసులు వారి వివరాలు నమోదు చేసుకొని వదిలిపెట్టారు. దీనిపై రైల్వే ఎస్ఐ నాగప్పను 'సాక్షి' వివరణ కోరగా... ప్రేమ జంటపై రైల్వే కో-పైలెట్ వ్యవహార శైలిపై ఆవేదన వ్యక్తం చేశారు.

చీనీకి గిట్టుబాటు ధర కల్పించండి



మార్కెట్‌యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న చీనీ రైతులు, సీపీఐ, సీపీఎం నాయకులు

- చీనీ రైతులతో కలసి వామపక్ష నేతల ధర్నా

అనంతపురం అగ్రికల్చర్: ఈ-నామ్ విధానాన్ని రద్దు చేసి బహిరంగ వేలం ద్వారా చీనీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ, సీపీఎం నాయకులు, రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ-నామ్‌ను వ్యతిరేకిస్తూ సోమవారం అనంతపురంలోని చీనీ, వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ఈ-నామ్ ముసుగులో ధరలు తగ్గించి చీనీ రైతులను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఫలితంగా 42,900 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో చీనీ తోటలు కలిగిన 'అనంత'లో రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. ఎంత ధర పలికిందనే విషయం తెలియకుండా ఇష్టారాజ్యంగా అమలు చేస్తున్న ఈ-నామ్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. బహిరంగ వేలం పాట నిర్వహించి రైతులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కెట్‌లో క్రయవిక్రయాలకు సంబంధించి నిబంధన మేరకు 4 శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా... ఆ మొత్తాన్ని ఏకంగా 10 శాతం చేసి రైతులను దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో కష్టనష్టాలు, రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి పంట పండించిన చీనీ రైతులను మార్కెట్ వర్గాలు నిలువునా మోసం చేస్తున్నాయని విమర్శించారు. అలాగే బయట తోటల్లో నేరుగా అమ్మకాలు సాగిస్తున్న రైతుల నుంచి వ్యాపారులు, దళారులు డబుల్‌సూట్ రూపంలో పెద్ద ఎత్తున దందా చేస్తూ నష్టం వచ్చేలా చేస్తున్నందున దీనినీ అరికట్టాలని డిమాండ్ చేశారు. చీనీ రైతులను ఆదుకునే చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పోలీసులు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం జరిగేలా సమస్యలు, డిమాండ్లు మార్కెట్ అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు బాబా, పండ్లతోటల రైతుల సంఘం నాయకులు శివారెడ్డి, చీనీ రైతులు శ్రీనివాసులునాయుడు, కొత్తపల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి కృషి చేయండి

- అర్చక సమాఖ్య నేతల డిమాండు



మాట్లాడుతున్న అర్చక సమాఖ్య నాయకులు

అనంతపురం కల్చరల్: అర్చకుల సంక్షేమానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని అర్చక సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. ధూపదీప నైవేద్య పథకం (డీడీఎన్ఎస్), డెత్ గ్రాట్యూటీ కోసం అర్చకులు ఎదురు చూడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం అనంతపురంలోని మొదటిరోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం వేదికగా జిల్లా అర్చక సమాఖ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లాల అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. డీడీఎన్ఎస్ కింద ఉమ్మడి జిల్లాలోని 898 దేవాలయాల్లో అర్చనలు కొనసాగుతున్నా... పలు కారణాలతో పథకం లబ్ధి అందకుండా పోయిందని తెలిపారు. రెండేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 475 దేవాలయాలను ధూపదీపనైవేద్యం పథకానికి ఎంపిక చేశారని, అయితే అనేక కారణాలను చూపుతూ ఆర్థిక సహకారం నిలిపి వేయడం బాధాకరమని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఎండోమెంట్ సిబ్బంది కొరతను సాకుగా చూపి ఆలయాలపై పర్యవేక్షణ లేకుండా చేయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డిపల్లి రాజేష్, మారుతీప్రసాద్, ముచ్చుకోట ప్రసాద్, భక్తరహళ్లి వేణుగోపాలస్వామి, రెండు జిల్లాలకు చెందిన అర్చకులు పాల్గొన్నారు.

నారు సాగులో మెలకువలు పాటించండి

- రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్ బాబు



గోవిందపల్లిలో సాగు చేస్తున్న నారు మడి

బుక్కరాయసముద్రం: వరి నారు సాగులో మెళకువలు పాటించాలని రైతుకలు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్ బాబు సూచించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగులో భాగంగా ఇప్పటికే బోరు బావుల కింద వరి నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో రైతులు నాణ్యమైన విత్తనాన్ని ఎన్నుకోవాలన్నారు. జూలై చివరి వారం లేదా ఆగస్ట్ మొదటి వారంలో వరి నారు పెంచేందుకు అనుకూలమని పేర్కొన్నారు. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండైజిం కలిపి విత్తనశుద్ధి చేసిన 24 గంటల తర్వాత మడిలో చల్లాలని సూచించారు. ఎకరాకు 20 నుంచి 25 కిలోల వరి విత్తనం వేయాలన్నారు. గరుకు భూముల్లో 30 కిలోలు వేసుకోవచ్చునన్నారు. వరి మొలక చల్లుకునే ముందు నారమడులను బాగా దుక్కి చేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా సిద్ధం చేయాలన్నారు. 5 సెంట్ల నారమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. సెంటుకు 5 కిలోల చొప్పన వరి విత్తనం చల్లాలని సూచించారు. నార ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకూ పలుచని నీటి తడులు ఇస్తూ.... తొలగిస్తూ ఉండాలన్నారు. నారు మడులలో జింక్ లోపం ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేటు ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. విత్తనం వేసిన 10 రోజులకు సెంటు నారమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాజిన్ 3జి లేదా 4జి గుళికలు చొప్పున వేయాలన్నారు. గుళికలు అందుబాటులో లేకుంటే మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లేదా క్లోరోపైరిఫాస్ 2.0 మిల్లీ లీటరు నీటికి కలిపి 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలన్నారు. మడిలో నార తీసేందుకు 7 రోజుల ముందు కార్బోఫ్యూరాజిన్ గుళికలు వేయాలన్నారు. బీపీటీ వరి నార అయితే 2 నెలల తర్వాత నాటాలని, 1010 రకమైతే 30 రోజులకు నాటుకోవచ్చునని సూచించారు.

సమగ్ర ఉద్యోగుల ఖాతాల్లో జీతం

- మే, జూన్ నెలల జీతాల బడ్జెట్ ఈ నెల 16న విడుదల
- తీరిన అనంతపురం జిల్లా ఉద్యోగుల సమస్య
- శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులకు మొండిచెయ్యి
- అధికారుల తీరుపై మండిపడుతున్న పొరుగు జిల్లా ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. బకాయి ఉన్న రెన్నెళ్ల జీతాలు సోమవారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో అధికారులు జమ చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి మే, జూన్ జీతాల బడ్జెట్ ప్రభుత్వం విడుదల చేసినా ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్ష అధికారుల అలసత్వం కారణంగా ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. ఇదే అంశంపై 'జీతమో రామచంద్రా' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై అనంత సమగ్ర శిక్ష అధికారులు స్పందించారు. లోపాలను సరిదిద్దుకుని ఆగమేఘాలపై ఫైలు సిద్ధం చేసి ఆమోద ముద్ర వేసి బిల్లులను బ్యాంకుకు పంపారు. దీంతో సోమవారం ఉదయమే ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జీతాలు జమ అవుతూ వచ్చాయి. సాయంత్రానికి అందరి ఉద్యోగులకు జీతాలు పడ్డాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో సమగ్ర శిక్ష కింద 2,800 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. మే, జూన్ నెలలకు సంబంధించి జీతాల బడ్జెట్ ఈనెల 16న ప్రభుత్వం విడుదల చేసింది. అనంతపురం జిల్లాకు రూ.6.57 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ. 6.46 కోట్లు విడుదలయ్యాయి. అనంతపురం జిల్లా ఉద్యోగుల సమస్యకు సోమవారంతో తెరపడినా... శ్రీసత్యసాయి జిల్లా ఉద్యోగులకు జీతాల జమ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. కారణం ఏదైనా ప్రభుత్వం వారం కిందటే జిల్లాకు బడ్జెట్ విడుదల చేసినా నేటికీ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకపోవడం గమనార్హం. దీనిపై ఆ జిల్లా ఉద్యోగులు మండిపడుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ స్పందించి తమ జీతాలు బిల్లులు పెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని ఆ జిల్లా ఉద్యోగులు కోరుతున్నారు.

మీ సేవలు అమూల్యం



ఆత్మీయ వీడ్కోలు సభలో అభివాదం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, (చిత్రంలో) జేసీ కేతన్‌గార్గ్, సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం అర్బన్: జిల్లా అభివృద్ధికి, ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల్లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ అందించిన సేవలు అమూల్యమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ కొనియాడారు. బదిలీపై వెళుతున్న కేతన్‌గార్గ్, నిదియాదేవి, మేఘస్వరూప్‌కు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు సభలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా జేసీ, సీఈఓ, కమిషనర్ పనిచేశారన్నారు. విమర్శలకు తావివ్వకుండా అంకితభావంతో వారు అందించిన సేవలు వెలకట్టలేమన్నారు. అనంతరం వారిని కలెక్టర్, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'



బొమ్మలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 రామాంజనేయులు

ఆత్మకూరు: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని ఎంఈఓ-2 రామాంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులు స్థానికంగా లభించే వనరులతో అభ్యసన సామగ్రి తయారు చేశారు. వివిధ రకాల బొమ్మలు గీసి ఆకట్టుకున్నారు.

సాగు పట్టాలివ్వాలని వినతి

అనంతపురం అర్బన్: ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం గిరిజన తండాల్లో అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజనలకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు గిరిజన సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వచ్చిన సామా నాయక్, శివాజీనాయక్, గోవిందనాయక్, తదితరులు సమస్యను వివరించారు. మండలం పరిధిలోని వీపీపీ తండా, ఎన్ఎన్‌పీ తండా, వీపీసీ తండా, పందికుంట తండ, జె.రాంపురం తండాలోని దాదాపు 120 మంది గిరిజనులు అటవీ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమిని లబ్ధిదారులకు పంపిణీకి సిద్ధంగా చేసినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియ జరగలేదన్నారు. ప్రస్తుతం దీనిపై చర్యలు తీసుకుని లబ్ధిదారులకు సాగుదారులకు భూమి పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు.

అలవెన్సులు రికవరీ చేయాలి



ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ బి.అనితకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అక్రమమార్గంలో అలవెన్సులు తీసుకుంటున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు కోరారు. సోమవారం ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి.అనితకు వినతిపత్రం అందజేశారు. వైకల్యం లేకపోయినా ఉన్నట్లు నకిలీ పత్రాలు సమర్పించి ప్రతి నెలా రూ.2 వేలు అలవెన్స్ తీసుకుంటున్నారని వీసీ దృష్టికి తెచ్చారు. ఇలా అడ్డగోలుగా అలవెన్స్ మంజూరు చేయించుకున్న వారి వివరాలను అందజేశారు. ఇప్పటి వరకూ రూ.1.5 కోట్ల మేర అలవెన్సులు స్వాహా చేశారన్నారు. వెంటనే రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు టి. సుధీర్ రెడ్డి, పి. హేమంత్ కుమార్, బి. జయచంద్రా రెడ్డి, శివ, కార్తీక్, గురుసాయి, రాకేష్ పాల్గొన్నారు.

'మా ప్లాట్లలో హద్దులు ఏర్పాటు చేశారు'



కలెక్టర్‌కు సమస్యను విన్నవించేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం అర్బన్: తాము కొనుగోలు చేసిన ప్లాట్లలో వేరొకరు వచ్చి హద్దులు ఏర్పాటు చేశారని కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో స్థలాన్ని మార్పు చేసి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు షేక్‌వలి బాషా, మురళీమోహన్, రామకృష్ణ, రామచంద్రా రెడ్డి, నల్లప్ప, రవినాయక్, తదితరులు సమస్యను మీడియాకు వివరించారు. రుద్రంపేట పంచాయతీ కక్కలపల్లి పొలం వికలాంగుల కాలనీ వద్ద సర్వే నంబర్ 99-1లో 7.12 ఎకరాలు, 99-2లో 6.65 ఎకరాలు, సర్వే నంబర్ 100లో 15.08 ఎకరాలు మొత్తం 28.85 ఎకరాల భూమి 1933 నుంచి గుగ్గిళ్ల నాగిరెడ్డి వంశస్తులైన కామాక్షమ్మ కుటుంబ సభ్యులకు సంబంధించినదని తెలిపారు. 1990లో వారు ప్లాట్లు వేసి అమ్మితే దాదాపు 500 మంది కొనుగోలు చేశారని తెలిపారు. ఇందులో చాలా మంది బ్యాంకు రుణం తీసుకుని గృహాలు నిర్మించుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 10వ తేదీ వరకు రెవెన్యూ రికార్డుల్లో ఇళ్ల స్థలాలుగా నమోదు చేసి ఉందన్నారు. అయితే ఆ మరుసటి రోజున అంటే జూన్ 11వ తేదీ నుంచి మెట్ట భూమిగా రెవెన్యూ రికార్డులో మార్పు చేశారన్నారు. ఈనెల 5 తేదీన బళ్లారి వాస్తవ్యులు ఎం.అనూప్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు పోలీసు బందోబస్తుతో వచ్చి సర్వే నంబర్ 99-1లోని 7.12 ఎకరాలు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేశారన్నారు. ఇదే స్థలంలో ప్లాట్లను తాము కొనుగోలు చేసి ఇళ్లను నిర్మించుకున్నామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో స్థలం మార్పుపై విచారణ చేయించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆస్తుల ధ్వంసం వద్దు..
అభివృద్ధే ముద్దు

- ఆగిపోయిన 4 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత
- కంపెనీలు తీసుకొస్తే ప్రయోజనకరం
- అసెంబ్లీలో గళమెత్తాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి



రాప్తాడు నియోజకవర్గం గుండా వెళ్లే హంద్రీనీవా కాలువ (ఫైల్)

కనగానపల్లి/ఆత్మకూరు/రాప్తాడు/చెన్నేకొత్తపల్లి/రామగిరి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా కాలువ నుంచి పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చేందుకు రూ.800 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా కనగానపల్లి మండలంలోని పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి వద్ద రెండు సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణం కూడా చేపడతామన్నారు. కానీ అప్పట్లో కాలువ పనులు కొంతమేర జరిగినా ప్రాజెక్టుల నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత హంద్రీనీవా కాలువ ద్వారా పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చారు. ఇదే నిధులతో నాలుగు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. వీటిలో ఆత్మకూరు మండలంలో ముట్టాల, తోపుదుర్తి రిజర్వాయర్లతో పాటు కనగానపల్లి మండలంలో సోమరవాండ్లపల్లి, చెన్నేకొత్తపల్లి మండలంలో దేవరకొండ ప్రాజెక్టుల నిర్మాణానికి భూమి పూజ కూడా చేసి కొన్నిచోట్ల పనులు కూడా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తే నియోజకవర్గంలో సుమారు లక్ష ఎకరాల వరకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ నియోజవర్గం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన పరిటాల సునీత సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా పూర్తీ చేయించేందుకు కృషి చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు. వీటితో పాటు రాప్తాడు నియోజకవర్గం గుండా హైదరాబాద్-బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారి వెళ్తుంది. ఈ రహదారి పక్కన పరిశ్రమలు ఏర్పాటు చేయించాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అసెంబ్లీలో గళం వినిపించాలని స్థానికులు సూచిస్తున్నారు.

నిరుద్యోగులకు దారి చూపండయ్యా..



మన ప్రాంతంలో చదువుకుని ఉద్యోగాలు లేక యువత అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి. యువత ఉద్యోగాలు లేక ఇతర ప్రాంతాల వలస వెళ్తున్నారు. ఇంకా కొంతమంది వేరే ఊళ్లకు వెళ్లలేక వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత నిరుద్యోగులకు దారి చూపాలి.

– అశోక్‌కుమార్, పైలబోయలపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

వలసలను నివారించండి



వర్షాలు లేక రైతులు చాలా అవస్థలు పడుతున్నారు. మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు వర్షాధారిత పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. పంటల సాగుకు పెట్టుబడులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. లేకపోతే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే పరిస్థితి ఉంది. రైతులకు వ్యక్తిగత రుణాలు ఇచ్చి ఆదుకోండి. వందశాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలి.

– లింగన్న, సీపీఎం నాయకుడు, చెన్నేకొత్తపల్లి మండలం

రైతులకు మేలు చేయండి..



హంద్రీనీవా కాలువ గుండా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాలుగు ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా నేరుగా పేరూరు డ్యాంకు నీరు తీసుకెళ్లాలి. వీటి ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో మాట్లాడి నిధుల మంజూరుకు చొరవ తీసుకోవాలి.

– ఈశ్వర్, నరసంపల్లి, కనగానపల్లి మండలం

పెట్టుబడి సాయం అందజేయాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా రైతుల సంక్షేమానికి కృషి చేయాలి. పంటల సాగుకు రూ.20 వేల సాయం వెంటనే అందజేస్తే రైతులకు ఉపయోగపడుతుంది. ఎమ్మెల్యే సునీత గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలి. అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేయాలి. పంచాయతీల వారీగా నిధులు మంజూరు చేయాలి.

– రాజేష్, పేరూరు, రామగిరి మండలం

తారురోడ్డు వేయిస్తే మేలు



మా గ్రామానికి తారు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 108కు ఫోన్ చేస్తే రోడ్డు సరిగ్గా లేనందున 108 రావడం లేదు. 2018లో అప్పటి ఎమ్మెల్యే పరిటాల సునీత మరూరు నుంచి సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి మండలంలోని మారెమ్మ దేవాలయం వరకూ దాదాపు 7 కిలోమీటర్ల రోడ్డు వేసేందుకు రెండు సార్లు భూమి పూజ చేశారు. రోడ్డు పనులకు సంబంధించి మట్టి పనులు పూర్తి చేసి చిన్న చిప్స్ కంకర వేసి వదిలేశారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గెలవడంతో రోడ్డు పనులు పూర్తి చేయాలని అప్పటి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాంట్రాక్టర్ టీడీపీ నేత, సునీతమ్మ చిన్నాన్న కావడంతో రోడ్డు పనులు చేయలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

– బుడగ నాగరాజు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



మా గ్రామంలో పేదలు ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పెళ్లిళ్లు చేసుకుని అలాగే ఉంటున్నారు. ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ భూమిలో వైఎస్సార్ జగనన్న కాలనీ ఏర్పాటు చేసి 200 ప్లాట్స్ పేదలకు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 2020లో టీడీపీ నాయకులు ఆ భూమి ఇళ్ల పట్టాలకు ఇవ్వకూడదని హైకోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. ఇప్పటికైనా పరిటాల సునీతమ్మ స్పందించి పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి. 2017లో డ్వాక్రా మహిళ సంఘాల మహిళలకు కమ్యూనిటీ భవనాన్ని కట్టిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. భవనం కూడా మంజూరు చేయించాలి.

– రవికుమార్, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

పన్ను తగ్గిస్తే బాగుంటుంది



విద్యుత్ చార్జీలు, ఇంటి పన్ను తగ్గించాలి. సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితికనుగుణంగా పన్ను మొత్తం ఉంటే బాగుంటుంది. నగరంలో ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగింది. కానీ ఇంకా పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలి. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసినట్లు ఉంటుంది.

– నాగిరెడ్డి, ద్వారక నగర్

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే ప్రతిపక్షాన్ని రోడ్డుపై నిరసనలు చేసేలా తీసుకువచ్చింది. అభివృద్ధి చేయాలని ప్రజలు ఓట్లు వేశారు. అయితే దీనికి విరుద్ధంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని దాడులు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ప్రజలకు ఇచ్చి హామీలను నెరవేర్చడంలో శ్రద్ధ చూపాలి. ప్రతిపక్ష పార్టీ మీద దాడులు చేయడం నిజంగా సిగ్గుచేటు. దాడులు చేసే వాటిపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాన్ని అభివృద్ధి చెయ్యడంలో ఉండాలి. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు.

– నరసింహారెడ్డి, వడ్డుపల్లి, ఆత్మకూరు మండలం

పరిశ్రమలతో ఉపాధి



అనంతపురం నియోజకవర్గంలో ఏదైనా పరిశ్రమ ఏర్పాటు కావాలి. దీని ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. దీంతో అనంతపురం నియోజకవర్గం అభివృద్ధి మరింత సాధ్యపడుతుంది. అదేవిధంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయాలి. రైతులకు ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పటికే నగరంలో ప్రధాన రోడ్లు, కాలువలు బాగా ఉన్నాయి. పార్కులను అభివృద్ధి చేయాలి.

– రమేష్ విద్యుత్ నగర్

హామీలు నెరవేర్చాలి



టీడీపీ అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో చాలా హామీలను ఇచ్చింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ గతంలో జగనన్న చేసిన విధంగా కుల, మత, పార్టీలు చూడకుండా అర్హతను గుర్తించి ప్రతి ఒక్కరికి పథకాలు అందించాలి. అధికారంలోకి వచ్చాక చాలా గ్రామాల్లో పింఛన్లు తొలగిస్తాం.. ఇంటి స్థలాలు వెనక్కి తీసుకుంటామని చెప్పడం దుర్మార్గం. చిత్తశుద్ధి ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి. అర్హులకు పథకాలు అందిస్తే నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు సహకరిస్తారు. అభివృద్ధిని అందరూ స్వాగతిస్తారు.

– బాలపోతన్న, సిద్ధరాంపురం, ఆత్మకూరు మండలం

చార్జ్‌షీట్లపై తదుపరి చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భవనాల అతిక్రమణల చర్యల్లో భాగంగా చార్జ్‌షీట్ దాఖలు చేసిన వాటిపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఏసీపీ మారుతీహరి ప్రసాద్‌ను మునిసిపల్ ఆర్‌డీ, ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశించారు. సోమవారం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన నగరపాలక సంస్థలో వివిధ సెక్షన్ హెడ్స్‌తో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎన్ని చార్జ్‌షీట్లు దాఖలు చేశారని ఏసీపీని ప్రశ్నించారు. 236 భవనాలపై చార్జ్‌షీట్లు దాఖలు చేశామని, మరో 25 సిద్ధం చేసినట్లు ఏసీపీ కమిషనర్‌కు వివరించారు. రెండేళ్ల క్రితం వంద భవనాలపై చార్జ్‌షీట్లు దాఖలు చేశారని, ఆ భవనాల నుంచి ఇంత వరకు ఎందుకు అపరాధ రుసుం వసూలు చేయలేదని ప్రశ్నించారు. కోర్టులో జడ్జికు విన్నవించుకుందామని, చార్జ్‌షీట్ తదుపరి చర్యలు జరిగేలా ప్రత్యేకదృష్టిసారించాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబుకు కమిషనర్ సూచించారు. నగరంలో అభివృద్ధి పనులు ఏవిధంగా జరుగుతున్నాయని ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. అమినిటీ, పారిశుధ్య కార్యదర్శులు సెట్‌లు వాడేలా చూడాలన్నారు. తద్వారా క్షేత్ర స్థాయిలో వారు విధుల్లో ఉన్నారో లేదో స్పష్టంగా తెలుస్తుందన్నారు. 254 సెట్లు అందుబాటులో ఉన్నాయని.. మరికొన్ని టెండర్ పిలవనున్నట్లు ఈఈ సుధారాణి తెలిపారు. ఇంటి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిను కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఆర్ఓ సతీష్, డీఈ చంద్రశేఖర్, రవీంద్ర రెడ్డి, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ మేఘ స్వరూప్‌కు వీడ్కోలు



కమిషనర్ మేఘ స్వరూప్‌ను సన్మానిస్తున్న మేయర్ వసీం, ఇన్‌చార్జ్ కమిషనర్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి కమిషనర్ మేఘ స్వరూప్ అన్ని విధాలుగా సహకారం అందించారు. ఆయన సేవలు మరువలేనివని మేయర్ వసీం కొనియాడారు. నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఉన్న ఆయన బదిలీపై మదనపల్లి సబ్ కలెక్టర్‌గా వెళ్తున్న సందర్భంగా సోమవారం నగరపాలక సంస్థలో సన్మానించారు. మునిసిపల్ ఆర్‌డీగా ఉన్న పీవీవీఎస్ మూర్తి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి మేయర్ వసీం నగర పాలక సంస్థలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ మేఘ స్వరూప్ సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ ఏడు నెలల పాటు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలన్నారు. కమిషనర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ.. సమష్టి కృషితోనే నగరాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైపుల్లాబేగ్, వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, తిరుపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ప్రమాదం కనపడదా?



తెగిపడిన విద్యుత్ తీగను చూపుతున్న ప్రభాకర్

రాప్తాడు: గొందిరెడ్డిపల్లి-పుల్లలరేవు గ్రామాల మధ్యలో పీఏబీఆర్ కుడికాలువ సమీపంలో విద్యుత్ లైన్ తెగి రహదారిపై పడిపోయింది. ఈ విషయంపై 1912 నంబర్‌కు ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు జూటూరి ప్రభాకర్, జూటూరు మారుతి తెలిపారు. విద్యుత్ తీగను మార్చాలని లైన్‌మెన్, ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని వాపోయారు.

తప్పిన ప్రమాదం..

సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు దాదాపుగా 500 గొర్రెలను తీసుకుని కాలువపై అటుగా వచ్చారు. వారికి విద్యుత్ లైన్ తెగి పడిపోయిన విషయం తెలియదు. గొర్రెలు విద్యుత్ లైన్ దగ్గరికి రావడంతో అక్కడే ఉన్న రైతు జూటూరు శేఖర్ విద్యుత్ లైన్ తెగి పడిపోయిందని అప్రమత్తం చేశాడు. గొర్రెల కాపరులు వెంటనే గొర్రెలను విద్యుత్ లైన్ దగ్గరికి వెళ్లకుండా మరో దారి వెంబడి తీసుకెళ్లారు.

విధుల్లోకి జిల్లా ఉద్యానశాఖ అధికారి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ అధికారి బీఎంవీ నరసింహారావు సోమవారం విధుల్లో చేరారు. 40 రోజుల పాటు సెలవుపై వెళ్లిన ఆయన సెలవు ముగియడంతో తిరిగి బాధ్యతలు తీసుకున్నారు. ఇన్‌చార్జి డీడీహెచ్‌గా ఉన్న జి.ఫిరోజ్‌ఖాన్ తిరిగి ఏపీఎంఐపీ ఏపీడీగా బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖకు పథక నిర్దేశన, అనుమతులు జారీ చేసిన వెంటనే అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రచించి రంగంలోకి దిగుతామని తెలిపారు.

హాస్టల్ తనిఖీ

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివ ప్రసాద్ యాదవ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. హాస్టల్‌లో సౌకర్యాలపై ఆరా తీశారు.

ఎంపీఈఓల సమస్యలు పరిష్కరించాలి



వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీఈఓల సమస్యలను పరిష్కరించాలని ఎంపీఈఓల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శంకర్, భాస్కర్‌నాయక్, రెడ్డి ప్రసాద్ కోరారు. సోమవారం విజయవాడలో వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావును కలిసి వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం, డెప్యుటేషన్లు రద్దు చేయాలని కోరారు. రెన్యూవల్ జీఓపై చర్చించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

అనంతపురం సెంట్రల్: చీనీకి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని మార్కెట్‌యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి ఆదేశించారు. సోమవారం చాంబర్‌లో చీనీ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ-నామ్ విధానాన్ని కొనసాగిస్తూనే రైతులకు మంచి ధరలు లభించేలా చూడాలన్నారు. ఈ-నామ్ రద్దు చేయడం తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. పోటీతత్వంతో మంచి ధరలు దక్కేలా చూడాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాం వద్ద తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం సాయంత్రం వరకు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. నగర ప్రజలు తాగునీరు పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

వాల్మీకి మండల యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా మోహన్

రాప్తాడు: వాల్మీకి మండల యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని మరూరు గ్రామానికి చెందిన కొండపల్లి మోహన్‌ను ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం స్టేట్ జాయింట్ సెక్రటరీ కేశవ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కొండపల్లి మోహన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టాలని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత, గిరిజనుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నారు. నిధులు మంజూరు చేయాలన్నారు. ఎన్నికల ముందు టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగించి నిధులు కేటాయిస్తామని చెప్పారని గుర్తు చేశారు. హామీ మేరకు వెంటనే పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గత ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో శివయ్య, శ్రీరాములు, సుంకన్న, వన్నూరప్ప, రామకృష్ణ, ఓబులేసు, నరసింహులు పాల్గొన్నారు.

బస్సులను తనిఖీ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయి స్వామి మాట్లాడుతూ.. చాలా విద్యాసంస్థల బస్సులు పరిమితులకు మించి విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. పాతబడిన బస్సులు నడుపుతున్నా ఆర్టీఓ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు డ్రైవర్లు మద్యం సేవించి బస్సులు నడుపుతున్నా యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు రాయుడు, నగర అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు తారక్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంలో విద్యార్థి ఎన్నికలు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక జీసస్ నగర్‌లోని భాష్యం స్కూల్‌లో సోమవారం విద్యార్థి ఎన్నికలు ఘనంగా జరిగాయి. సార్వత్రిక ఎన్నికల తరహాలో నిర్వహించారు. విద్యా సంస్థల జెడ్ఈఓ రవివర్మ పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. భారత దేశంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాముఖ్యత, మేనిఫెస్టో ప్రాధాన్యత, రాజకీయాల్లో యువత ఆవశ్యకతను తెలియజేశారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, హెచ్‌ఎం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఓటుహక్కు వినియోగించుకున్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: భూమిని ఆక్రమించిన వారి నుంచి రక్షణ కల్పించి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సంఘాల నాయకులు నెరమెట్ల ఎల్లన్న, లక్ష్మన్న, రామాంజనేయులు మాట్లాడారు. కూడేరు మండలం కడదరగుంట గ్రామం మాదిగ వర్గానికి చెందిన లక్ష్మీదేవి కుటుంబం ఉమ్మడిగా ఉన్నారన్నారు. సర్వే నంబర్ 27-2లో 11 ఎకరాల భూమి తమకు తాతాల నుంచి సక్రమించిందని పేర్కొన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూమిని ఆక్రమించుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధితులు రమేష్, రామచంద్ర, లక్ష్మీదేవి, కిష్టప్ప పాల్గొన్నారు.